నేను-మనం

అంగే రామారావు

'అట్లకు పిండి అయిపోయింది. వుప్మా వేయించమంటారా?' అని 'సరుకు మాష్టరు' అడిగినదానికి—

'వేయించవయ్యా! ప్రతిదానికీ నన్నడుగుతావేందుకు? అట్లు అయిపోతే వుప్మా వెయ్యాలని తెలియదు? రోజా కొత్త!' అని విసుక్కుంటూ అన్నాడు హోటల్ 'త్రిమూర్తిభవన్' ప్రొప్రయిటర్ కనకయ్య.

ఎప్పుడూలేనిది ఇవాళ యజమాని ఇంత చిరాకుగా వున్నాడేమిటా అని ఆ సరుకు మాష్టరు ఆశ్చర్యపోయాడు. మారుమాటాడకుండా లోపలికెళ్ళిపోయాడు.

కనకయ్య బీడితీసి వెలిగించాడు. ఛీ ఛీ, అంతా వెధవలు దొరికారు. ఒక్కడికీ తెలివికాయ లేదు. ప్రతిదానికీ తనని అడగటమే నని విసుక్కున్నాడు.

అప్పుడు సాయంత్రం నాల్గు గంటలయింది. హోటల్ 'త్రిమూర్తిభవన్' రద్దీగా వుంది. జనం వస్తున్నారు. ఫలహారాలు తిని కాఫీలు త్రాగుతున్నారు. బిల్లులు చెల్లించిపోతున్నారు. కనకయ్య కేష్‌లో కూర్చుని బిల్లులు తీసికుంటున్నాడు.

ఆవూళ్లో 'త్రిమూర్తిభవన్'కు మంచి డిమాండ్ వుంది. బస్సు స్టాండింగ్‌కు దగ్గరలో ఈ హోటల్‌ను కొట్టే హోటలే లేదు. బస్సులకెళ్లేవాళ్లే కాకుండా వూళ్లో జనం కూడ చాలమంది ఆ హోటల్‌కే వస్తారు. సైకి పేరుకు బోర్డుమీద 'త్రిమూర్తిభవన్' అని వుంటుంది. కాని అంతా కనకయ్య హోటల్ అనే అంటారు. కనకయ్య హోటల్‌లో అన్నివేళలందూ వేడి వేడి యిడ్లీలు దొరుకుతాయి. వుల్లిపాయ పెసరట్టుకు కనకయ్య హోటల్ పెట్టిందిపేరు!

కనకయ్య అనే పేరునుబట్టి అతను వయస్సుమళ్లిన వ్యక్తి అని అనుకుంటున్నారా? కాదు. కనకయ్య యువకుడే! అతని వయస్సు 33—35 సంవత్సరాలకంటె ఎక్కువుండదు. ఆవయస్సుకే అతను మంచి వ్యాపారదక్షత గలవాడయ్యాడు. ఆ హోటల్‌మీద మంచి లాభాలు తీశాడు. ఈరోజతని దగ్గర పదిహేనువేలవరకు రొక్కం వుంది. ఒకపక్కా డాబా వుంది. ఇదంతా ఈ హోటల్‌మీద, వుల్లిపాయ పెసరట్లమీద సంపాదించిందే!

అసలు ఈ హోటల్ పూర్వం, అంటె 7సం.ల క్రితం, ఒక తాటాకుల పాకలో వుండేది. అప్పుడు యింతమంది సర్వర్లు లేరు; అసలు సర్వర్లు వుండేవాళ్లుకాదు. అన్నీ కనకయ్యే చూచుకునేవాడు. పెనం దగ్గర కూర్చుని అట్లు వేయటం, పేసింజర్సుకు కాఫీ ఫలహారాలు అందించటం, డబ్బులు తీసికోవటం, పిండి రుబ్బుకోవటం—అన్నీ కనకయ్యే స్వయంగా చేసుకునేవాడు. పోతే ఎంగిలిప్లేట్లు, గ్లాసులు తీస్తానికి మాత్రం చేతిక్రింద ఒక కుర్రవాడుండేవాడు. ఇలా వుండగా, ఆ పాకకు ఎదురుగా ఆర్. టి. సి. బస్సుస్టాండింగ్ పడింది. దానితో కనకయ్య దశ మారింది.

కనకయ్య పాక హోటల్‌కు డిమాండ్ పెరిగింది. నేల అద్దెకు తీసికున్న పాక స్థలాన్ని స్వంతంగా కొనేశాడు. దాని మీద త్రిమూర్తిభవన్ వేసాడు. పెనం దగ్గిర కూర్చుని అట్లువేసే కనకయ్య ఇవాళ్టి రోజున క్యాష్‌లో కూర్చుని బిల్లులు తీసికుంటున్నాడు. ఇప్పుడా హోటల్‌లో ఖరీదయిన ఫర్నీచర్ వుంది. పన్నెండు మంది సర్వర్లు, ఆరుగురు క్లీనర్లు, లోపల సరుకులు తయారు జేయటానికి మరో ముగ్గురు పని వాళ్ళు, లెక్కలు రాసే గుమస్తా వున్నారు.

కనకయ్య ఈ హోటల్ మీద తీసిన లాభాలతో ఊళ్లో తను వుండటానికి ఒక చక్కని మేడ కట్టించుకున్నాడు; ఒక అందమైన పిల్లను పెళ్లిచేసుకున్నాడు. ఆ పిల్లకెన్నో ఖరీదయిన చీరలు కొన్నాడు; నగలు చేయించాడు. ఆ పిల్ల యింటిపని చేసుకోలేదని ఒక వంట మనిషిని, యిద్దరు నౌఖర్లను పెట్టాడు. ఆ పిల్ల మనాది పెట్టుకుంటుందని చెప్పి ఆమె పుట్టింటి తరఫు వాళ్లంతా పిల్లతోపాటు కనకయ్య యింటికి కాపురానికొచ్చారు!

కనయ్య ఇవాళ రేపట్లో ఒక కారు కూడ కొనాలని ప్రయత్నిస్తున్నాడు.

...జేబులోంచి మంగుళూరు బీడికట్ట తీసి ఒక బీడి వెలిగించాడు. ఆవులిస్తూ కనకయ్య హోటల్ బయటికి చూశాడు.

హోటల్ ముందు కూర్చుని అడుక్కునే కుంటివాళ్ళు, గ్రుడ్డివాళ్ళు హోటల్‌కొచ్చే పాసింజర్లను ధర్మం చేయమంటూ జలగల్లాగా పట్టుకుంటున్నారు. ధర్మం చేసే వాళ్లు చేస్తున్నారు; లేదు పొమ్మని కసిరి కొట్టేవాళ్ళు కసిరి కొట్టుతున్నారు.

కనకయ్య ఈ దృశ్యాన్ని చూశాడు. అసలే ఆ రోజు చికాకుగావున్న కనకయ్యకు తిక్కరేగింది. ముష్టివాళ్ళమీద పట్టలేని కోపం ముంచుకొచ్చింది.

'ఒరేయ్ ముత్తిగా, అలా ఆ గుమ్మంలోనే వుండిపోయారేమిట్రా ? ఇట్లా లోపలికొచ్చి, కాఫీలు త్రాగుతున్న పాసింజర్ల చొక్కాలు పట్టుకుని దబాయించి మరీ అడగండిరా!...' అని అరిచాడు.

ఆ ముష్టివాళ్ళల్లో ముత్తిగాడన్నవాడు కుంటివాడు; ముసలివాడు. కనకయ్య ఈ హోటల్ పెట్టిన దగ్గర్నుంచి యిక్కడే కూర్చుని అడుక్కుంటున్నాడు. వాడ్ని చూస్తే కనకయ్యకు ఒక విధమైన అభిమానమే! అప్పుడప్పుడు పండుగలకు పబ్బాలకు వాడికి మిగిలిపోయిన అన్నం, సాంబారు పోయిస్తూ వుంటాడు.

ఇప్పుడు కనకయ్య కోపంగా అన్నమాటలకు ముత్తిగాడు చిన్నబుచ్చుకున్నాడు. ఈ 6, 7 సంవత్సరాల్లో తనకి తెల్సినంత వరకు కనకయ్య ఎప్పుడూ యిలా విసుక్కుని వుండలేదు.

ముత్తిగాడు మెల్లగా, 'ఏం లేదు దొరా...' అని అన్నాడు.

'ఏం లేదురా ? వచ్చేవాళ్ళమీద అలా పడి అడుగుతుంటే హోటల్‌కొచ్చే పాసింజర్స్ ఎలా వస్తారురా ?' అని కనకయ్య నిష్ఠూరంగా అన్నాడు.

కనకయ్య ఆరిపోయిన బీడీని అవతలకి విసిరేసి, ఒక సర్వరును పిలిచి ఒక స్ట్రాంగ్ టీ పట్టుకురమ్మన్నాడు. ఆ సర్వరు వెంటనే ఒక టీ స్పెషల్‌గాచేసి తీసికొచ్చాడు.

కనకయ్య టీ త్రాగుతుంటె అక్కడే నిలబడ్డ సర్వరు తల గోక్కుంటూ ఏదో చెప్పాలన్నట్లుగా, 'సార్!' అన్నాడు.

'ఏం?' అని అడిగాడు కనకయ్య.

ఆ సర్వరు సిగ్గుపడుతూ మెల్లగా, 'పెళ్ళి చేసుకోబోతున్నా సార్—' అన్నాడు.

'మంచిదే !'

'రెండు నెలల జీతం అడ్వాన్సు యిప్పించండి సార్!'

అసలే విసుగ్గావున్న కనకయ్యకు చర్రున కోపం ముంచుకొచ్చింది.

'రెండునెలల అడ్వాన్సు కావాలా? ఏం జూసి ఇవ్వమంటావోయ్? మీ సర్వర్లకు ఒక హోటల్ అనేముంది? ఇవాళ ఈ హోటల్‌లో వుంటారు. రేపు ఇంకో హోటల్‌కు పోతారు. మీ మీద ఎలా పెట్టుబడి పెట్టమంటావోయ్?...అడ్వాన్సు లేదు, ఏంలేదు. వెళ్లి నీపని చూస్కో!' అని కసురుకున్నాడు.

పాపం, ఆ సర్వరు మారు మాటాడకుండా వెళ్లిపోయాడు.

కనకయ్య బీడి వెలిగించాడు...ప్రతివాడూ డబ్బు అడిగేవాడే! మరి తనేం డబ్బు కుప్పలుపోసి కూర్చున్నాననుకుంటారేమో! ఇందాకమటుకు ఇందాక 'అయన' వచ్చి ఒక వేయిరూపాయలివ్వమన్నాడు; ఏదో వ్యాపారల పెట్టుకుంటానని. వెయ్యి రూపాయలు! ఈ కరువురోజుల్లో వెయ్యి రూపాయలంటే మాటలా? అసలు తనెందుకివ్వాలి? ఏం జూసి ఆయనకు వెయ్యి రూపాయలిస్తాడు? తనకు స్వయాన అన్నే అవుతాడు. అన్న అయినంతమాత్రాన వృధి తార్థంగా చూస్తూ చూస్తూ వెయ్యి రూపాయలెందుకివ్వాలి? ఇస్తాడు...మళ్లీ తిరిగి యిస్తాడని గ్యారంటి ఏముంది? నీళ్లు వదులుకోవల్సిందేగా?

...ఈరోజు కనకయ్య అంత చికాకుగా వుండటానికి, అందరిమీదా అలా విసుక్కోవటానికి అసలు కారణం వాళ్లన్నయ్య వేయిరూపాయి అడగటం! ఆ రోజు మధ్యాహ్నం కనకయ్య అన్న భూషయ్య హోటల్‌కొచ్చాడు. ఒక వేయిరూపాయిలు అప్పుగా అడిగాడు. ఆడబ్బుతో రెండో మూడో రిక్షాలు కొని బాడుగకు యిచ్చుకుని వాటి అద్దెమీద వచ్చేడబ్బులో అప్పు తీర్చుకుంటాను అన్నాడు. ఈ అడగటం వుత్తరాల ద్వారా రెండుమూడు నెలలుగా అడుగుతూనే వున్నాడు. ఒక్క ఉత్తరానికీ కనకయ్య సమాధానం ఇవ్వకపోవటంవల్ల ఈరోజు భూషయ్యే వూరునుండి స్వయంగా వచ్చాడు. తనకి సహాయం చేయమని నోరుతెరచుకుని తమ్ముడ్ని అడిగాడు. నాదగ్గర డబ్బేమీ లేదు, నన్ను వూరికే అడగవద్దని కనకయ్య నిర్మొగమాటంగా, కరాకండిగా చెప్పేశాడు.

ఇక అడిగి లాభంలేదనుకున్న భూషయ్య వెళ్లబోతూ ఒకమాట అని మరీ వెళ్ళాడు; 'నేను లోగడ చేసిన సాయాన్ని మరిచిపోయావన్నమాట!' అని అన్నాడు.

ఆరోజు కనకయ్య చికాకుకు, విసుగుకు కారణం భూషయ్య అన్న ఈ మాటే!

కనకయ్య బీడిదమ్ములాగుతూ ఇలా ఆలోచిస్తున్నాడు—

ఆ రోజుల్లో తను వూళ్లో, పేటల్లో తిరిగి ఉదయంపూట యిడ్లీలు, మధ్యాహ్నాలు 'కుంపటి కాఫీ' అమ్ముతుండేవాడు. కొన్నిరోజులకు, ఇలా వూళ్లో తిరిగేదాని కంటె ఎక్కడయినా ఒక చిన్న కాఫీ దుకాణం పెట్టుదామనిపించింది. ఎంత పాకలోపెట్టినా పాత్రసామాను కొనాలంటే 50 రూపాయలన్నా పెట్టుబడి కావాలి.

భూషయ్యను డబ్బు అడిగాడు. కాని అంత డబ్బు భూషయ్యదగ్గరమాత్రం ఎక్కడుంది. అతని పరిస్థితి అంతంత మాత్రంగానేవుంది. ఆ రోజుల్లో భూషయ్య కూరగాయల కావుళ్ళు పట్నంలో అమ్ముతుండేవాడు. తమ్ముడికి సహాయం చేయాలని తన భార్య మెడలోవున్న వెండికంటె, తనచేతి మురుగులు అమ్మి కావల్సిన డబ్బుయిచ్చాడు. ఆ డబ్బుతో ఒకపాకలో చిన్న కాఫీ దుకాణం పెట్టాడు. తన అదృష్టం బాగుంది. దేముడు చల్లగా చూశాడు. ఆనాటి పాక ఈరోజున 'త్రిమూర్తి భవన్' అయింది.

...అవును, ఆరోజు తను హోటల్ పెట్టటానికి ఆయన సహాయం చేశాడు. ఎవరు కాదన్నారు? దానికి తగిన ప్రతిఫలం తానెప్పుడో ముట్టజెప్పాడు. అత్తగారి వూరుపోయి పొలాలు కౌలు చేసుకుంటానని ఈ వూరొదలిపోతున్నప్పుడు రెండొందలిచ్చి పంపాడు. ఆయన తనకని మహాసహాయం చేస్తే అంతాకలిసి ఒక వందచేసివుంటాడు. దానికి రెట్టింపు యిచ్చాడు కదా! అవూళ్ళో కౌలుచేసుకుంటూ ఏమయినా బాగుపడ్డాడేమోననుకుంటే, వర్షాలులేక రెండేళ్ళనుండి పంటలు దెబ్బతిన్నాయని, పరిస్థితి బాగాలేదు ఏమయినా సాయం చేయమని రెండునెలలనుండి వుత్తరాలమీద వుత్తరాలు రాస్తున్నాడు. ఎప్పుడో తనకు సాయం చేశాడని ఇక బ్రతికినంతకాలం ఈ ముదువులు ఎక్కడ చెల్లించుకుంటాడు. అందుకే, ఒక్క ఉత్తరానికీ సమాధానమియ్యకుండా తానూరుకున్నాడు. ఇవాళ తానే స్వయంగా వచ్చాడు. డబ్బు అడిగాడు. లేదనేటప్పటికి మొగం ఇంతజేసుకున్నాడు. 'నేనారోజున చేసిన సాయం మర్చిపోయావన్నమాట' అని విష్ఫారంగా అన్నాడు.

బాగుపడే దశ వుంటె ఎలాగయినా బాగుపడతాడు. ఆ రోజాయన డబ్బు యివ్వకపోతే భగవంతుడు ఇంకోవిధంగా చూచేవాడు. తానింకోవిధంగా బాగుపడేవాడు. ఎవరి అదృష్టం వాళ్ళది! మధ్యన ఈయన చేసిందేమిటి? చేసిన దానిని అప్పుడే యిచ్చుకున్నాడుగా! ఆయనికి తాను డబ్బుయిచ్చిన దొక్కటే కనిపిస్తుంది. కాని, తాను పడ్డ కష్టం? పిండి రుబ్బేడు. పెనం దగ్గర కూర్చుని అట్లువేశాడు. అంట్లు తోముకున్నాడు. ఎంగిలి ప్లేట్లు, గ్లాసులు కడుక్కున్నాడు. తిన్న రోజులూ వున్నాయి, తినని రోజులూ వున్నాయి. మరి ఈ కష్టమంతా ఎవరు పడ్డారు? తానొచ్చి పడ్డాడా? ఆ రోజున తాను కష్టపడ్డాడు. దేముడు చల్లగా చూశాడు. ఈ రోజున ఇంత సంపాదించుకుని సుఖపడుతున్నాడు. దీనికి మధ్యలో ఒకళ్ళు వరగపెట్టిందేమిటి? ఇదెవరి భిక్షకాదు! తన కష్టార్జితం ఇవాళ డబ్బున్నదని అందరికీ పంచిపెట్టుతూ కూర్చుంటె రేపు తనకి లేనప్పుడెవరిస్తారు? వచ్చేరోజూ వుంటుంది— రాని రోజూ వుంటుంది. తనకి మాత్రం పెళ్ళాం బిడ్డలులేరు. వాళ్ళ కోసం ఇంత వెనకేసుకోవద్దూ?

*　　　*　　　*

ఆరు గంటలవుతుంది. సన్నసన్నగా చీకటి పడుతుంది. దీపాలు వెలిగాయి. కనకయ్య సర్వర్లను ఒక్కొక్కడినే పిలిచి ఆ రోజు బత్తాలిచ్చాడు. పాలు పోసే వీరాస్వామి వచ్చాడు. పాలు బాగుండటంలేదని నాలుగు కేకలేసి డబ్బుయిచ్చి పంపాడు.

హోటల్‌కు వచ్చే జనం రద్దీ తగ్గిపోయింది. అయిదు నిమిషాలకు, పదినిమిషాలకు ఒకళ్ళు వచ్చి కాఫీ, టీ త్రాగిపోతున్నారు. కనకయ్య ఒక కాఫీ తెప్పించుకుని త్రాగి ఇంకో బీడి వెలిగించాడు. బీడి పొగ వదులుతూ రోడ్డు వంక చూశాడు. ముష్టి ముత్తిగాడు తన వంక జాలిగా చూచినట్లనిపించింది. కనకయ్యకు వాడిమీద జాలివేసింది. ఇందాకా వాడ్ని అనవసరంగా కేకలు వేశాడు. పాపం, వీడేం చేస్తాడు? వెధవది ఇందాక వచ్చిన చిరాకుతో తనకేవిరా లోచలేదు అనుకున్నాడు.

హోటల్ ముందు కూర్చున్న ముష్టివాళ్ళు జోలి, డబ్బా, కర్రా సర్దుకుని ఇకా రోజుకు గుడిశలకు పోవటానికి సిద్ధమవుతున్నారు. ఆ రోజు వాళ్ళ సంపాదనను లెక్కలు చూచుకుంటున్నారు. ముత్తిగాడు తన కొచ్చిన చిల్లర పైసలన్నీ లెక్కపెట్టుకున్నాడు. ఎనభై పైసలు వచ్చాయి. తన ప్రక్కన కూర్చున్న గుడ్డి నాగడికి ఆ రోజు 20 పైసలే!

ముత్తిగాడు, 'ఎంత సంపాయించావురా మనమడా!' అని నాగడ్ని అడిగాడు.

నాగడు కుర్రవాడే! వయస్సు పాతిక లోపే వుంటుంది. వాడికి పుట్టు గ్రుడ్డి. పయిగా ఈ మధ్య వాడికి కుష్ఠు కూడ పొడజూపింది. నాగడు ఎక్కడ్నుంచి వచ్చాడో ఒక పదిరోజుల్నుంచి ఈ హోటల్ ముందు ముత్తిగాడి ప్రక్కనే కూర్చుంటున్నాడు. వాడి దురదృష్టమేమిటో కాని వాడికెవ్వరూ ధర్మం వెయ్యరు. రోజంతా కూర్చుంటె పది పైసలు, ఇరవై పైసలు. అంతే! మరి, వాడి మొగం చూస్తే ఎవరికీ ధర్మం వెయ్య బుద్ధికాదో ఏమో!

ముత్తిగాడి కయితే ఎలా లేదన్నా రోజుకు రూపాయిదాకా వస్తుంది. వాడు వయస్సు మళ్ళినవాడు. ఈ హోటల్ ముందే 7 సంవత్సరముల నుండి కూర్చుంటున్నాడు. ఈ హోటల్‌కు రోజూ వాడికగా వచ్చే వాళ్ళందరూ వీడికీ తెలుసు. అందరికీ వీడు తెలుసు. వాడు నవ్వుతూ ధర్మం అడిగితే పాపాస్యంగా ఎవరూ లేదనరు.

'ఆఁ ఎంత తాత, యిరువయ్ పైచలు' —నీరసంగా జవాబిచ్చాడు నాగడు.

'ఓ రెదవా, ఈ పయిచలో ఏం చేత్తావురా? నూకలు కూడ రావుగందరా?'

'టీ నీళ్ళు తాగి తొంగుంటా—మరేం సేత్తా?'

'ఏదో ఏడువ్— నేనట్టా ఎల్లి బీడి ముక్కొటి తెచ్చుకుంటా—' అని ముత్తిగాడు కర్ర పోటు జేసుకుని మెల్లగా లేచాడు.

కనకయ్య వీళ్ళవంక చూస్తూ వీళ్ళ మాటలు వింటున్నాడు. బీడికోసం ముత్తిగాడు లేవగానే, 'ఇదిగోరా ముత్తయ్య బీడి!' అని అన్నాడు కనకయ్య.

'వత్తన్నా దొరా!' అని ముత్తిగాడు కర్ర పోటేసుకుంటూ వెళ్ళి, కనకయ్య యిచ్చిన బీడి తీసికున్నాడు.

ముత్తిగాడు తిరిగి వస్తూ వస్తూ నాగడి 'బొచ్చెలో' ఎవరో లోపల్నుంచి వచ్చే వాళ్ళు ధర్మం వేస్తున్నట్లుగా, పైసలు వేశాడు.

నాగడు, బొచ్చెలో పడ్డ పైసలు చూసుకుని, 'సల్లగుండు దొరా!' అన్నాడు.

ముత్తిగాడు గుబురు గడ్డంలోంచి నవ్వుకున్నాడు. ప్రక్కనున్న బీడీ కొట్టు దగ్గరకెళ్ళి నిప్పుతాడుకు బీడి వెలిగించుకున్నాడు.

తను కూర్చునేచోటుదగ్గరికి వస్తూ (కర్ర శబ్దంకాకుండా) మళ్ళీ నాగడి

బొచ్చెలో పైసలు వేశాడు.

నాగడు చేతితో పైపలమ తృప్తిగా తడుముకుంటూ మళ్ళీ, 'సల్లగుండు దొరా!' అన్నాడు.

ముత్తడు మళ్ళీ తృప్తిగా నవ్వు కున్నాడు.

తన మాములుచోటులో కూర్చుంటూ, ఏవీ ఎరగనట్లు, 'ఆఁ—ఏరా బుల్లోడా, మళ్ళీ సిల్లరపడ్డట్టుందే—' అని అన్నాడు. ముత్తడు.

'అవునే తాత! యిప్పుడే ఎవరో యిద్దరు దొరలు పైచ వేశారు. ఆళ్ళకడుపులు సల్లగుండ—ఆళ్ల బిడ్డపాపలు సల్లం గుండ—' అని తృప్తిగా, హుషారుగా అన్నాడు.

ముత్తడు గుడ్డివాడి బొచ్చెలో రెండు సార్లు ఎవరో వేసినట్లు పైసలువెయ్యటం కనకయ్య చూశాడు. ఒక ముష్టివాడు మరో ముష్టివాడికి పైసలు ధర్మం చెయ్యటం కనకయ్యకు అబ్బురమనిపిం చింది.

'మొత్తమెంత సంపాయించావురా? మూడ్నయా—ఎంత—అర్ధరూపాయి—ఫర్లా, గంజినీళ్ళు కాసుకోవచ్చు—'

'అర్ధరూపాయివుంటె ఇంకేం—ఆ మారాజుల పేరుసెప్పుకుని కడుపునిండా గంజినీళ్ళు తాగొచ్చు—'

'సరే, యింక నీ గుడిశకు పో—సీకట డింది—కార్లు రద్దిగా వుంది—జేగర్తగాపో—' అని గుడ్డినాగడ్ని పంపించేశాడు, ముత్తిగాడు.

నాగడు చేతికర్రతో నేలమీద తట్టు కుంటూ తడుముకుంటూ రోడ్డువారగ నడిచిపోయాడు.

కనకయ్య, ముత్తిగాడ్ని చూచి—'ఏమిట్రా అది, వాడికి నీడబ్బు వేశావేమిటి?' అని కుతూహలంగా అడిగాడు.

'ఆడి బొంద—ఆడికి ధరమం ఎవరేత్తున్నారు దొరా? ఈయాళంతా ఎండలో కూసుని అడుక్కుంటుంటె ఆడికి ఇరువయ్ పైచలొచ్చాయి. ఈ పైచలుతో గంజి కాసుకుంటానికయినా నూకలగింజలు రావు. ఆడింకేటి తినిసత్తాడు? నాకు ఈయాళ ఎనభయి పైసలొచ్చాయి. అందులో ఆడికి ముప్పయిపైచలేశాను దొరా! సాటోడు పత్తుంటె సూత్తూ వూరుకుంటానికి పేణం వప్పుతుందా దొరా?' అని అన్నాడు ముత్తిగాడు.

కనకయ్యకి ఎవరో చెర్నాకోలతో కొట్టి నట్లనిపించింది!

'సాటోడు ఏత్తుంటె సూత్తూ వూరు కుంటావా? నీకున్నదాంట్లో సాయం సేయవ్?' అని ఎవరో తన చొక్కాపట్టు కుని నిలేసి, దబాయించి అడుగుతున్న ట్లనిపించింది.

'అవున్రా—మరి అయిచ్చే డబ్బులే వాడికిచెప్పి చేతికెందుకీయగూడదు? అలా ఎవరో ధర్మంవేసినట్లు వెయ్యటమెందుకు?' కనకయ్యగొంతు నీరసంగా నూతిలోంచి పలికినట్లుగా పలికింది.

మూత్తిగాడు గొళ్ళున నవ్వాడు; వాడి గొంతు ఖంగున పలికింది. 'ఓ అదా? ఆడికోరోగం! డబ్బులు నేనిత్తె తీసికోరా అంటె తీసికుపోవడు. నీకొచ్చేడబ్బులు నీకే సాలవ్—నాకేం యిత్తావంటాడు? ఎంత సెప్పినా ఇనుకోడు; తీసుకోడు. అందుకని ఈవారం మట్టి ఇట్టగే నేనే ఎవరో దరమం సేసినట్లు ఏత్తుండా! ఈ పైచల్తో నేనేవన్నా మేడలూ మిద్దెలూ కట్తానా? ఏందో దొరా—వెనక జన్మంలో ఏం పాపం సేశానో, ఇప్పుడు ఇట్టగయ్యా—ఈ జల్మంలోనన్నా కూత్తంత మంచిపని, భగమంతుడుమెచ్చే పనిసేత్తే ముందుకయినా మంచిది—వత్తా దొర్రా—'

ముత్తిగాడు చేతికర్ర పోటేసుకుంటూ నిర్విచారంగా నిండుగా రైలుస్టేషన్‌వయిపు పోతున్నాడు.

వాడెంత నిస్వార్థజీవి!

మూత్తిగాడు, అయ్యా బాబు అని అందరిముందూ చేతులుచాపి అడుక్కున్న డబ్బుల్లోంచి, ఒకపూట గంజినీళ్లకు కూడా చాలీచాలని డబ్బుల్లోంచి తన 'సాటోడు'కు ఎందుకు దానం చేశాడు??

వాడు మనిషి గనుక! వాడికి సాటివాడి కష్టాల్నిచూచి జాలిపడే గుండెవుంది గనుక!

మరి నీకు???

'బాబు, హారతి కళ్ళకద్దుకుంటారా?'

దేముడి పటాలకు శుక్రవారం పూజ చేసిన పంతులు హారతితెచ్చి కనకయ్య ముందుపెట్టాడు.

వెలుగుతున్న హారతిలో ఏదో సందేశం!

అందరూ హారతిని కళ్ళకద్దుకుంటా రెందుకని? తను హరించుకుపోతూ, తను శూన్యమయి పోయేవరకూ మానవాళికి ఏదో శాంతిని, ధైర్యాన్ని, ప్రభోదాన్ని, భక్తి భావాన్ని ఇవ్వాలనే తాపత్రయంతో భగభగ లాడి గిలగిలలాడిపోతుంది గనుక!

* * *

కనకయ్య తలఎత్తి చూశాడు. శ్రీరామ చంద్రుడు, శ్రీనివాసుడు, ఆంజనేయస్వామి మల్లెపూలదండల వెనకగుండా తనని కని పెట్టుతున్నట్లనిపించింది; తన గుండెల్ని చీలుస్తూ చూస్తున్నట్లనిపించింది. తన కేదో చెప్తుతున్నట్లనిపించింది.

కనకయ్య రెండుచేతులెత్తి నమస్క రించాడు. మూసినకళ్ల చివరల్లోంచి వేడి కన్నీరు బయటికి కుబుకుతుంది.

కనకయ్య ప్రక్కగదిలో లెక్కలురాసు కుంటున్న గుమాస్తాని పిలిపించాడు. 'రేపు ఈ అడ్రసుకని రెండువేలరూపాయలకు డ్రాఫ్టు పంపించండి. మర్చిపోవద్దు—' అని అడ్రసు కాగితం యిచ్చాడు.

'అలాగేనండి! అని లోపలికెళ్లుతూ ఆ చీటీమీదవున్న పేరు చూశాడు గుమాస్తా.

'ఏరువాక భాషయ్య' అని వుంది. ●